క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



సి.బెళగల్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: వ్యవసాయ కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మండల కేంద్రంసి.బెళగల్‌లో జరగుతున్న పంట కాల్వల పూడికతీత పనులను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. పనుల దగ్గర కల్పించిన సౌకర్యాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కూలీల హాజరును, మస్టర్లను తనిఖీ చేశారు. కూలీలు ఉదయం ఏడు గంటలలోపు ఉపాధి పనులకు వచ్చి దినసరి వేతనం రూ.272లు వచ్చేలా కొలతలతో పనులు చేసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు హబీబ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి

ఓర్వకల్లు: మండలంలోని అన్ని గ్రామాలల్లో శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామంలో వివిధ సామాజిక వర్గాల శ్మశాన వాటికలను నాయకులు మధుసూదన్, మాసూంబాషా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నన్నూరు గ్రామంలోని బీసీ, ఎస్సీ, మైనార్టీల శ్మశాన వాటికలకు ప్రహరీలను నిర్మించి, స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రోషన్న, మధు, చిన్న మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడులో ఉపాధి కూలీ తెలుగు మద్దమ్మ(56) వడదెబ్బ బారినపడిన మంగళవారం మృతి చెందింది. సంఘటనకు సంబంధించి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనికి సోమవారం మద్దమ్మ తోటి కూలీలతో కలిసి వెళ్లింది. పని చేస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే కూలీలు మద్దమ్మను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను ఏపీఓ రామేశ్వరమ్మ, సీపీఎం డివిజిన్ కార్యదర్శి మోహన్ పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి నష్ట పరిహారంగా ప్రభుత్వం రూ. 10 లక్షల మంజూరు చేసి ఆదుకోవాలని మోహన్ కోరారు.

అనుమతులున్న విత్తనాలనే విక్రయించాలి



కోరమండలల్ దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులకు అనుమతులున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏఓ మల్లేష్ కుమార్ దుకాణాల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని కోరమండల్, కిసాన్ మాల్, ఓం శ్రీనాగ సాయి విత్తన, పురుగు, ఎరువు, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నిషేధిత మందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరలు, నిల్వల బోర్డులను ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసినవాటికి తప్పనిసరిగా రషీదులు ఇవ్వాలన్నారు. దుకాణాల నుంచి సేకరించిన విత్తన నమూనాలను తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లోని ల్యాబ్‌లలకు పంపుతునట్లు ఏఓ తెలిపారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి



రైతు భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందను రైతులంతా పంట పొలాలను దుక్కి దున్ని సన్నద్ధం కావాలని ఏఓ రవి ప్రకాష్ సూచించారు. మంగళవారం మండలంలోని లద్దగిరి గ్రామంలో ఏఓ రవిప్రకాష్ పర్యటించి రైతు భరోసా కేంద్నాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సబ్సిడీపై వేరుశనగ, పిల్ల పెసరను ప్రభుత్వం మంజూరు చేసిందని, అవసరమైన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. పత్తి సాగు రైతులు వర్షాలు పడి భూమి పదునెక్కిన తర్వాతనే విత్తుకోవాలని, వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏఓ కోరారు.

రైతన్న కలల సాకారం దిశగా..

- రూ.74.14 కోట్లతో 6 ఎత్తిపోతల పథకాల పనులు
- ఆయకట్టుగా మారనున్న 8,145 ఎకరాల బీడు భూములు
- 50 శాతం పనులు పూర్తి

మంత్రాలయం: వరద నీటిని ఒడిసి పట్టి మెట్టకు జీవం పోసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తుంగభద్ర జదీ జలాలతో ఎత్తిపోతల పథకాల నిర్మాణాలకు పురుడు పోసింది. కరవు నేలలో సిరులు పండించుకునేందుకు బాసటగా నిలిచింది. మెట్టను ఆయకట్టుగా మార్చి రైతన్నల కలలను సాకారం చేసేందుకు 6 ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసింది. నిర్మాణ పనులు వడివడిగా సాగుతుండటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా పనులు

రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలో మొత్తం 6 ఎత్తిపోతల పథకాలకు గానూ రూ.74.14 కోట్లు మంజూరు చేసింది. మంత్రాలయం మండలం ఖగ్గల్, 52-బసాపురం, కోసిగి మండలం ఐరన్‌గల్, కౌతాళం మండలం గోతులదొడ్డి, కోసిగి ఎత్తిపోతల పనులు ప్రారంభమయ్యాయి. సాతనూరు పనులు త్వరలోనే మొదలు పెట్టనున్నారు. ఖగ్గల్ పథకం పనులు ఇప్పటికే 60 శాతం పనులు చేపట్టారు. 4.5 కిలోమీటర్ల మేర పైపులైను పనులు పూర్తయ్యాయి. బసాపురం 4 కి.మీ., గోతులదొడ్డి 8.5 కి.మీ., కోసిగి 4.5 కి.మీ. ఐరన్‌గల్ 7.5 కి.మీ. మేర పనులు చేయాల్సి ఉండగా 50 శాతం పనులు పూర్తి చేశారు. బసాపురం, ఐరన్‌గల్, ఖగ్గల్ ఎత్తిపోతల పంపుహౌస్ నిర్మాణాలు 80 శాతం ముగించారు.



ఐరన్‌గల్లులో సాగుతున్న పైపులైన్ పనులు,



ఐరన్ పథకం పంపుహౌస్ పనులు

మండలం	పథకం	నిధులు రూ..	ఆయకట్టు (ఎకరాలలో)
మంత్రాలయం	52-బసాపురం	10.42 కోట్లు	1,455
మంత్రాలయం	ఖగ్గల్	6.90 కోట్లు	495
కోసిగి	ఐరన్‌గల్	18.52 కోట్లు	1,515
కోసిగి	కందకూరు	11.95 కోట్లు	1,170
కోసిగి	కోసిగి	5.00 కోట్లు	1,500
కౌతాళం	గోతులదొడ్డి	21.25 కోట్లు	2,010
మొత్తం		74.14 కోట్లు	8,145 ఎకరాలు

రైతన్న హర్షం

నది చెంతనే ఉన్నా ఎన్నో ఏళ్లగా తీర గ్రామాల రైతులు వర్షాధారంపైనే పంటలు పండించుకునే పరిస్థితి. గత ప్రభుత్వాలు ఏనాడూ రైతన్న ఇబ్బందులను గుర్తించలేదు. వైఎస్సార్‌సీసీ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రైతన్నలకు మేలు చేయాలని తలచారు. ముఖ్యమంత్రితో సంప్రదించి 6 ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయించుకున్నారు. అలాగే పులికనుమ ప్రాజెక్టు రిజర్వాయర్ కోసం కోసిగి రైతులు విలువైన భూములు కోల్పోయారు. కోసిగి రైతులు ఏళ్లగా తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యే రూ.5.38 కోట్లు మంజూరు చేయించి ఎత్తిపోతల పథకంతోపాటు, మండల కేంద్రం ప్రజల తాగునీటి కోసం ఎస్ఎస్ ట్యాంకు పనులు శ్రీకారం చుట్టారు. పథకాలు మంజూరుతో పాటు పనులు సైతం చకచకా పూర్తి చేస్తుండటంతో రైతుల హర్షం వెలిబుచ్చుతున్నారు.

కల నెరవేరబోతోంది



పులికనుమ జలాశయం నిర్మాణంలో నాతోటి రైతులు ఎందరో వందలాది ఎకరాలు కోల్పోయారు. కోసిగి రైతులకు రిజర్వాయర్ నుంచి ఎలాంటి సాగునీరు అందేది కాదు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మా కష్టాలను గుర్తించి ఎత్తిపోతల పథకం మంజూరు చేయడం సంతోషంగా ఉంది. పనులు కూడా వేగంగా చేస్తున్నారు. రెండు, మూడు నెలల్లో మా కల సాకారం కాబోతోంది.

– నాగిరెడ్డి, రైతు, కోసిగి

సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి



నియోజకవర్గంలో అత్యధికంగా వర్షధార భూములు ఉన్నాయి. ప్రస్తుతం ఎల్ఎల్‌సీ, గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకాల ద్వారా మాత్రమే సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్ట్‌ల గ్యాప్ మెట్టభూములను దృష్టిలో ఉంచుకుని కొత్తగా 6 ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయించుకున్నాం. ఈపథకాల ద్వారా దాదాపు 10 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నాం. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేసి సాగునీరు అందజేసేందుకు కృషి చేస్తాం. ఆర్డీఎస్ కుడిగట్టు కాల్వ నిర్మాణ పనులు కూడా పూర్తి చేసేందుకు త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సంప్రదింపులు చేయనున్నాం. రైతులకు సాగునీటి ఇక్కట్లు రాకుండా శతవిధాలా ప్రయత్నం చేస్తాం.

– వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే, మంత్రాలయం

ఈరోజు

నేటి నుంచి గడపగడపకు మన ప్రభుత్వం

సి.బెళగల్: మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్‌దొడ్డి గ్రామంలో బుధవారం నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7:30 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

పోలకల్‌లో 'వలంటీర్లకు వందనం'

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో బుధవారం గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సత్కరించడం జరుగుతుందని ఎంపీడీఓ రాముడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎనిమిది గ్రామ సచివాలయాలకు చెందిన 115 మంది వలంటీర్లను సన్మానిస్తామన్నారు. పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 12 గంటల అనంతరం కార్యక్రమం ఉంటుందని, కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల, బ్రాహ్మణదొడ్డి, పోలకల్, కొండాపురం గ్రామాలకు చెందిన వలంటీర్లు హాజరవ్వాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరై వలంటీర్లను సన్మానిస్తారని ఎంపీడీఓ వివరించారు.

• రేపు టాపర్లకు పురస్కారాలు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 25వ తేదీన ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలను అందిస్తున్న ఎంఈఓ కోటయ్య మంగళవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కోడుమూరు రూరల్ : ఉపాధి పనులను జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ కల్పించాలని, కూలీల సంఖ్యను నాలగు వేల నుంచి ఆరు వేలకు పెంచాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కోడుమూరు, కృష్ణాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పంట కాలువల పూడికతీత పనులను మంగళవారం డ్వామా పీడీ పరిశీలించారు. వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం నాలుగు వేల మంది కూలీలు మాత్రమే పనుల్లోకి వస్తున్నారని, ఈ సంఖ్యను రెండురోజుల్లోగా ఆరు వేలకు పెంచాలని ఏపీఓ రమాదేవిని ఆదేశించారు. ఉపాధి పనుల కల్పనలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పీడీ హెచ్చరించారు. ఉపాధి పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ఆసక్తిగల రైతులను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఎండలు మండుతున్నందున ఉదయాన్నే ఉపాధి పనులకు రావడంతో పాటు, పనిగంటల సంఖ్యను పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.272లకు తగ్గకుండా పడుతుందని పీడీ ఉపాధి కూలీలకు సూచించారు.



పంట కాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

జీవనోపాదులను మెరుగు పర్చుకోవాలి

కల్లూరు : ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా జీవనోపాదులను మెరుగుపర్చుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్‌రావు అన్నారు. మంగళవారం తడకనపల్లె గ్రామంలో ఉల్లి సోలార్ డ్రయర్ యంత్రాలు, షెడ్‌లను పరిశీలించారు. వాటిని వినియోగిస్తున్న మహిళలతో మాట్లాడి ఉపయోగాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువుల హాస్టల్‌ను సందర్శించి వాటి నిర్వహణ గురించి ఆరా తీశారు.



ఉల్లి సోలార్ డ్రయర్లను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు డీఆర్‌డీఏ ఏపీడీ

నేటి నుంచి వలంటీర్ల అభినందన సభలు

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లకు బుధవారం నుంచి అభినందన సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శవనాగప్రసాద్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో మొత్తం 303 మంది వలంటీర్లకు గాను 251 మందికి సేవా మిత్ర, సేవా రత్న అవార్డులు లభించినట్లు తెలిపారు. వీరికి ప్రభుత్వం తరుపున ప్రోత్సాహక బహుతులు అందజేయడం జరుగుతోందన్నారు. ఈ మేరకు 24వ తేదీ (బుధవారం) సాయంత్రం 3 గంటలకు మండలంలోని ఓర్వకల్లు, కాల్వ-1, కాల్వ-2, హుసేనాపురం-1, హుసేనాపురం-2, కన్నమడకల, శకునాల, బ్రాహ్మణపల్లె, కొమరోలు, సోమయాజులపల్లె, గుట్టపాడు, ఎన్ కొంతలపాడు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు మండల కేంద్రం ఓర్వకల్లు పొదుపు సమావేశ భవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 25వ తేదీ(గురువారం) సాయంత్రం 3 గంటలకు మండలంలోని నన్నూరు-1, నన్నూరు-2, నన్నూరు-3 సచివాలయాలు, మీదివేముల, పూడిచెర్ల, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, ఉప్పలపాడు సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు నన్నూరు-3 సచివాయంలో సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేతో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అమర్‌నాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వెల్లడించారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, నోడల్ ఆఫీసర్లు(అధికారుల బృందం), సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

సర్కిల్ దిమ్మెను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కోట్ల సర్కిల్‌లో మంగళవారం ఉదయం డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దిమ్మెను ఎక్కింది. కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లేందుకు టర్నింగ్ తీసుకుంటుండగా అదుపు తప్పి బస్సు సర్కిల్ దిమ్మెను ఎక్కి ఒకవైపు ఒరగడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. ప్రమాదాన్ని పసిగట్టిన డ్రైవర్ బస్సును ముందుకు వెళకుండా ఆపేయడంతో పాటు, ప్రయాణికులను క్షేమంగా కిందకు దింపేశాడు. బస్సును రివర్స్ చేసి దిమ్మెపై నుంచి కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా పాత బస్టాండ్ సెంటర్‌లోని కోట్ల సర్కిల్‌ను వెడల్పుగా చేసినప్పటికీ చుట్టూ ఉన్న రోడ్డును వెడల్పు చేయకపోవడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల భారీన పడుతున్నారు. సర్కిల్ చుట్టూ హోటళ్లు, టీ దుకాణాలుండడంతో నిత్యం వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపేస్తున్నారు. రోడ్డు పక్కనే పంచాయతీ అధికారులు మురుగునీటి కాల్వను ఏర్పాటు చేయడంతో రోడ్డు మరింత కుదించుకపోయింది. దీంతో కోట్ల సర్కిల్ వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీ నెలకొనడంతో పాటు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కోట్ల సర్కిల్ రోడ్డును వెడల్పు చేయడంతో పాటు, రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



జిరాక్స్ సెంటర్లపై ఆంక్షలు

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల ఉండే ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.బుధవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను మూసి వేయాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

- పది ఉత్తీర్ణత శాతం ఎందుకు తగ్గింది
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పాటుపడాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. కల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు వివరించారు. కె.మార్కపురంలో వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ కార్యాలయంలో సిబ్బందికి తగిన విధంగా పర్నీచర్ సమకూర్చాలని సర్పంచ్ గణమద్దిలేటి సభ దృష్టికి తీసుకొచ్చారు. అర్హత కల్గిన రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రమేషబాబు తెలియజేశారు. తడకనపల్లె గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 5లక్షలతో త్వరలో పనులు చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే సల్కాపురంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులు రూ. 1.05కోట్లతో పనులు జరుగుతున్నాయని, వారంలో పనులు పూర్తవుతాయన్నారు. అర్హులైన రైతులకు గత నాలుగు సంవత్సరాలు రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించినట్లు ఏఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఐదవ సంవత్సరం మొదటి విడత కింద అదనంగా 223 మంది రైతులు రైతు భరోసా పథకానికి అర్హులైన్నట్లు ఏఈ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ అర్హుందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. కౌలు రైతులు ఇబ్బందులు పడకుండా అర్హులై కౌలు రైతులకు కౌలు కార్డులు అందించాలన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా, వైద్యానికి అధిక ప్రాధన్యతను ఇస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని గుర్తు చేశారు. పేదలు తమ పిల్లల చదువులకు ఇబ్బందులు పడకుడదనే అమ్మ ఒడి, జగనన్న కానుక ద్వారా పుస్తకాలు, షూస్, యూనిఫాం, టై, జగనన్న గోరు ముద్ద కింద నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. మనబడి నాడు-నేడు పథకం కింద పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తూ రూపురేఖలు మార్చుతున్నామన్నారు. అయితే పది విద్యార్థుల ఉత్తీర్ణత శాతం సాధించడంలో విఫలం అవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఉద్యోగం రావడానికి ఎంత కష్టపడ్డారో తరగతి గదిలోనూ అలాగే విద్యార్థులకు బోధిస్తే మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జీవి రమణమూర్తి, తహసీల్దార్ రమేష్‌బాబు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గడివేముల: మండల పరిధిలోని బూజు నూరు క్రాస్ రోడ్ వద్ద మంగలవారం నంద్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనచోదుకలు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. అదేవిధంగా వాహనానికి సంబంధించిన రికార్డులు, లైసెన్స్ తప్పనిరిగా ఉంచుకోవాలన్నారు. రికార్డులు సరిగా లేని రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు చెప్పారు. కొన్నేళ్ల నుంచి టాక్స్ పెండింగ్‌లో ఉందని, ఆ మొత్తం చెల్లిస్తే ట్రాక్టర్లను రిలీజ్ చేస్తామన్నారు.

పలువురు వైద్యులకు పదోన్నతి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురు వైద్యులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ స్థానాలు కేటాయించారు. జనరల్ సర్జరీలో పనిచేస్తున్న డాక్టర్ వి.వెంకట రమాబాయి, డాక్టర్ వై.శారద అనంతపురం మెడికల్ కళాశాలకు, డాక్టర్ ఎస్.విజయ బాబు, డాక్టర్ ఎన్.మల్లికార్జున నంద్యాల మెడికల్ కళాశాలకు, డాక్టర్ ఎన్.కస్తూరిబాయి (ఆప్తల్మాలజీ) కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, డాక్టర్ ఎం.రాజేష్ కుమార్ (ఆర్థోపెడిక్), డాక్టర్ టి.కుముద (గైనకాలజీ) కర్నూలు మెడికల్ కళాశాలకు, డాక్టర్ యు.సుజాత పట్నాయక్ (గైనకాలజీ) నెల్లూరు మెడికల్ కళాశాలకు, డాక్టర్ పి.అజయ్‌కుమార్ (టీబీసీడీ) తిరుపతి మెడికల్ కళాశాలకు పదోన్నతిపై బదిలీ అయ్యారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ యూనివర్సిటీలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగు ల నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. పాత గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసి న ఈ సమావేశంలో నాన్ టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగుల అధ్యక్షుడిగా పి.సుంకన్న, కార్యదర్శిగా బి.మద్దయ్య, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఇస్మాయిల్, సంయుక్త కార్యదర్శిగా బి.అనురాధ, ట్రెజరర్‌గా బి.చిన్న హుస్సేనయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.నాగరాజు, అడ్వైజర్ సభ్యుడిగా ఎ.మాధవశేఖర్, పదిమంది ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పి.సుంకన్న మాట్లాడుతూ వర్సిటీలోని కొంత మంది నాన్ టీచింగ్ సిబ్బందిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

సి.బెళగల్: సచివాలయాల ఉద్యోగులు ప్రజల సమస్యల పరిష్కారంకు కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మండల పరిధిలోని గొల్లలదొడ్డి సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. రికార్డులను, ఉద్యోగుల హాజరు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడారు. ఉద్యోగుల హాజరు, పనితీరుపై గ్రామ ప్రజలు తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సచివాలయంలో మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు తప్పనిసరిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్, వీఆర్వో లింగేష్ పాల్గొన్నారు.

రెమిడియన్ తరగతుల పరిశీలన

మండల కేంద్రం సి.బెళగల్‌లోని మోడల్ స్కూల్‌ను ఎంపీడీఓ రాముడు సందర్శించారు. పది ఫెయిల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న రెమిడిలయ్ తరగతులను ఆయన పరిశీలించారు. తరగతులు జరుగుతున్న తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంపీడీ ఉపాధ్యాయులకు సూచించారు.



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

కర్నూలు (టౌన్) : పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేరా లైఫ్-మేరా స్వచ్ఛ షహార్ అన్న కార్యక్రమంలో నగర వాసులు భాగస్వాములు కావాలన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక కార్యాలయం ప్రాంగణంలో డిప్యూటీ కమిషనర్ ఎస్వీ రమాదేవి ఆధ్వర్యంలో ఆర్.ఆర్.ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్) కేంద్రాన్ని కమిషనర్ ప్రారంభించారు. నిరుపయోగంగా ఉన్న వ్యర్థాలు, పుస్తకాలు, ప్లాస్టిక్ సీసాలను అక్కడే ఏర్పాటు చేసిన వేర్వేరు డబ్బాల్లో కమిషనర్ వేశారు. అలాగే నగరపాలక ఉద్యోగులు ఇంటి నుంచి తెచ్చిన పాత వస్తువులు, బట్టలు తమ వంతు బాధ్యతగా డబ్బాల్లో వేసి సంతకాలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్ లో భాగంగా పర్యావరణ పరిరక్షణ సంబంధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. 52 వార్డుల పరిధిలోని కాలనీల్లో ఆర్.ఆర్.ఆర్. కేంద్రాలను వచ్చే నెల 5 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతాలకు ప్రజలు పాత వస్తువులు, నిరుపయోగంగా ఉన్న దుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత పుస్తకాలు డబ్బాల్లో వేయాలన్నారు. తర్వాత వాటిని పునర్వియోగానికి, పునరుత్పత్తికి నగరపాలక చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ శేషాసాయి, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, ఆర్ఓ జునీద్ పాల్గొన్నారు.



ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భార్గవ్‌తేజ

పార్శిల్ సేవలను వినియోగించుకోండి

కర్నూలు (రూరల్): ప్రజలు తపాలా శాఖ అందిస్తున్న పార్శిల్ సేవలను వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వస్తువులను పంపించడానికి కావలసిన ప్యాకింగ్ కవర్లు కూడా నగరంలోని హెడ్ పోస్టాఫీసులో అందుబాటులో ఉన్నాయన్నారు. నామమాత్రపు ధరలతో మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.